
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం : 17 : జూన్ : 2024



సోమశిలలో 8.870 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 8.870 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 1607 క్యూసెక్కుల వరద వస్తోంది. దిగువకు 210 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.74,200
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.6,664
3 శాతం జీఎస్టీతో	రూ.6,864
నవర (8 గ్రా)	రూ.54,912

గరిష్టం/కనిష్టం
39.0 /28.2

వాతావరణం

వాతావరణంలో తేమ 69 శాతం ఉంది. జిల్లాలో సోమవారం అక్కడక్కడ ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. ఎండ తీవ్రత కూడా ఎక్కువగా ఉంది.

న్యూస్‌రీల్

రెండు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్ట్‌లో రెండు యూనిట్ల నుంచి మాత్రమే విద్యుదుత్పత్తి జరుగుతోందని ప్రాజెక్ట్ ఇంజినీర్లు ఆదివారం తెలిపారు. 1వ యూనిట్లో 460 మెగావాట్లు, 3వ యూనిట్లో 550 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోందని వెల్లడించారు. సాంకేతిక కారణాలతో 2వ యూనిట్లో విద్యుదుత్పత్తి నిలిపివేశామన్నారు.

తిరుమల శ్రీవారి ఉచిత దీవెనయాత్ర నేడు

నెల్లూరు (బృందావనం): సత్యమార్గ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నెల్లూరు నగరం నుంచి తిరుమల శ్రీవారి 25వ ఉచిత దీవెన యాత్ర ప్రారంభమవుతుందని నిర్వాహకులు పి.మస్తానమ్మ ఆదివారం తెలిపారు. అలిపిరి నుంచి తిరుమలకు మెట్ల పూజ మహాపాదయాత్రను సోమవారం ఉదయం 11 గంటలకు పురమందిరం వద్ద ఉన్న శ్రీజ్యోతివిఘ్నేశ్వరస్వామి ఆలయం నుంచి ప్రారంభమవుతుందన్నారు. మహాపాదయాత్రను ఇందుకూరుపేట లలితామహేశ్వరి ఆశ్రమ నిర్వాహకులు రామాయణం మహేష్‌స్వామి, నెల్లూరు దత్తాత్రేయ మఠం నిర్వాహకులు మాత అనంతగిరిస్వామి ప్రారంభిస్తారని తెలిపారు. ఈ యాత్రలో పాల్గొనే భక్తులు ఉదయం 9 గంటలకు పురమందిరం వద్దకు రావాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు వివరాలకు 93466 99526 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

ఐదుగురు విలేకరులపై కేసు నమోదు

గూడూరు రూరల్ : గూడూరుకు చెందిన ఐదుగురు విలేకరులపై ఆదివారం కేసు నమోదు చేసినట్టు గూడూరు రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. మండలంలోని రామలింగాపురంలో కిరణ్ అనే వ్యక్తి తన పట్టా భూమిని చదును చేసుకునే క్రమంలో మట్టిని తవ్వి చెన్నూరు ప్రాంతంలో ఉన్న తన స్థలంలోకి తరలిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఐదుగురు విలేకరులు అక్కడికి చేరుకుని మట్టి తవ్వకంతో పాటు తరలింపునకు అనుమతి ఉందా? అని ప్రశ్నించి అతని బెదిరించి, నగదు డిమాండ్ చేసి తీసుకున్నారని పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు డీఎస్పీ విచారణ చేపట్టారని వెల్లడించారు. డబ్బు తీసుకున్న విషయం నిజమని తేలడంతో విలేకరులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కుజదోష నివారణ పూజలు



చిట్టమూరు (చిల్లకూరు) : చిట్టమూరు మండలం మల్లాంలో కొలువైన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఆదివారం కుజ దోష నివారణ పూజలు చేశారు. స్వామివారికి ఉదయం పలు రకాల అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. పలువురు భక్తులు తమ పిల్లలకు కుజ దోష నివారణకు ప్రత్యేక పూజలు చేయించారు.

రాయితీ ఫలం.. ఉద్యానయోగం

జిల్లాలో పండ్ల తోటల పెంపకానికి అనుకూలమైన నేలలు ఉన్నాయి. ప్రధానంగా నిమ్మ, మామిడి, బత్తాయి, బొప్పాయి, సపోటా, జామ ఇలా దాదాపు 15 రకాల పండ్ల తోటలు, వివిధ రకాల కూరగాయలు, పూలతోటలు సాగులో ఉన్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉద్యాన పంటలను ప్రోత్సహించింది. పండ్ల తోటలను అధికంగా పెంచాలని ఉద్యానశాఖకు లక్ష్యాలను నిర్దేశించింది. యాంత్రీకరణ పరికరాలతో పాటు పంటల సాగుకు రాయితీలను ప్రకటించి ప్రోత్సాహాన్ని అందించింది. ఈ రాయితీలను మూడు విడతలుగా పంపిణీ చేసి రైతులకు పండ్ల తోటల సాగుపై ఆసక్తి పెంచేందుకు ప్రయత్నించింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఈ రాయితీలను కొనసాగిస్తుందని రైతులు ఆశిస్తున్నారు.



మూడేళ్లలో హెక్టార్‌కు అందించే రాయితీ (మొత్తం (రూ.ల్లో))

మామిడి	నిమ్మ	బత్తాయి	టీసీ అరటి
13,300	16,004	16,004	40,985
బొప్పాయి	జామ	ఆయిల్ పామ్	డ్రాగన్ ఫ్రూట్
24,662	29,335	29,000	40,000













ఉద్యానశాఖ ఆధ్వర్యంలో నిమ్మతోటల పెంపకం

- పండ్ల తోటలకు 40 శాతం ప్రోత్సాహం
- యాంత్రీకరణకు 40 నుంచి 50 శాతం రాయితీ
- జిల్లాలో 55 వేల హెక్టార్లలో పండ్లతోటల సాగు
- లాభాల బాటలో ఉద్యాన రైతులు

పొదలకూరు: జిల్లాలో గడిచిన ఐదేళ్లలో పండ్ల తోటల విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. గత ప్రభుత్వం ఉద్యాన పంటలకు చేయూతనివ్వడంతో విస్తీర్ణం ఆశించిన మేరకు పెరిగినట్టుగా తెలుస్తోంది. ప్రధానంగా 70 శాతం మంది రైతులు వరి సాగుపైనే ఆధారపడి జీవిస్తున్నారు. అయితే పంట మార్పిడి పద్ధతిని రైతులకు అలవాటు చేసే దిశగా ప్రభుత్వం ఉద్యాన పంటలను గణనీయంగా పెంచేందుకు కృషి చేసింది. జిల్లాలో ఉద్యాన పంటలు సుమారు 55 వేల ఎకరాల్లో సాగు అవుతుండగా రానున్న ఏడాదిలో 75 వేల ఎకరాలకు పెంపొందించేందుకు కసరత్తు చేస్తోంది. ప్రధానంగా పండ్లు, కూరగాయల తోటల సాగును పెంపొందించేందుకు రాయితీలను అందిస్తున్నారు.

కూరగాయలు, పూల సాగుకు 40 శాతం రాయితీ

కూరగాయలు పండించే రైతులకు ఒక లబ్ధిదారుడికి గరిష్టంగా రెండు హెక్టార్ల వరకు ప్రభుత్వం రాయితీ ఇస్తోంది. మొత్తం ఖర్చులో 40 శాతం రాయితీగా ఒక హెక్టార్‌కు రూ.20 వేలు అందజేస్తోంది. సాగులో కలుపు నివారణకు ఒక హెక్టారుకు 50 శాతం రాయితీ కింద గరిష్టంగా రూ.16 వేలు అందిస్తోంది. రాష్ట్రీయ కృషీ విజ్ఞాన్ శాశ్వత పందిళ్లపై కూరగాయల సాగుకు హెక్టార్‌కు రూ.2.50 లక్షలను ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. ఇక మల్లె, చామంతి, కనకాంబరం, బంతి, లిల్లీపూల పెంపకానికి చిన్న, సన్నకారు రైతులకు మొత్తం ఖర్చులో 40 శాతం రాయితీగా ఒక హెక్టారుకు రూ.16 వేలు వంతున ప్రభుత్వం అందజేస్తోంది. ఇతర రైతులకు మాత్రం

ఉద్యాన పంటల సాగుకు రాయితీలు

ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వంలో ఉదారంగా రాయితీలను ప్రకటించింది. ఈ రాయితీలను మూడు విడతలుగా పంపిణీ చేసి రైతులకు పండ్ల తోటల సాగుపై ఆసక్తి పెంచేందుకు ప్రయత్నం చేసింది. పండ్ల తోటల సాగు ద్వారా అధిక దిగుబడులను ప్రోత్సహించేందుకు మామిడి హెక్టార్‌కు రూ.13,300, నిమ్మకు, బత్తాయి హెక్టార్‌కు రూ.16,004, టీసీ అరటి హెక్టార్‌కు రూ.1,33,199, బొప్పాయి హెక్టార్‌కు రూ.24,663, జామ హెక్టార్‌కు రూ.29,335 అందజేస్తున్నారు, డ్రాగన్ ఫ్రూట్ హెక్టార్‌కు రూ.40,000, ఉసిరి, నేరేడు, చింత పంటలకు రూ.18,000, హైబ్రిడ్ కూరగాయల పెంపకానికి రూ.20,000, ఆయిల్ పామ్ హెక్టార్‌కు రూ.29,000, ఆయిల్ పాంలో అంతర్ పంటల సాగుకు రూ.21,000, ఆయిల్‌పాం ఎరువులకు రూ.21,000 అందజేస్తున్నారు. పూల పెంపకం హెక్టార్‌కు రూ.16,000, మల్చింగ్ ఏర్పాటుకు రూ.16,000 ఇస్తున్నారు. ఇక 20 ఏళ్ల వయస్సు దాటిన మామిడిలో పాత తోటల పునరుద్ధరణ పథకం కింద ఒక హెక్టార్‌కు రూ.17,500 ప్రభుత్వం రాయితీ ఇస్తోంది.

25 శాతం రాయితీగా అంటే ఒక హెక్టార్‌కు రూ.10 వేలు సాయం చేస్తోంది.

మరిన్ని రాయితీలు

పంట కోత అనంతరం వాషింగ్, గ్రేడింగ్, ప్యాకింగ్‌లను సమర్థవంతంగా చేపట్టేందుకు, ప్యాక్ హౌస్ నిర్మాణం కోసం గరిష్టంగా రూ.2 లక్షలు రాయితీ లభిస్తోంది. శీతల గది, శీతల గిడ్డంగులు, పండ్లు మాగపెట్టుకునే గదులకు, మార్కెటింగ్ మౌలిక వసతులకు బ్యాంకు లింకేజీ ద్వారా 35 శాతం రాయితీ లభిస్తోంది. ఉద్యాన యాంత్రీకరణ పరికరాల కొనుగోలుపై చిన్న, సన్నకారు రైతులకు 50 శాతం, ఇతరులకు 40 శాతం ప్రభుత్వం రాయితీ అందించి ప్రోత్సహిస్తోంది. కరువు పరిస్థితుల్లో ఉద్యాన పంటలను సంరక్షించుకునేందుకు నీటి కుంటలు తవ్వుకుంటే రైతుకు గరిష్టంగా రూ.75 వేలు రాయితీ అందజేస్తోంది.

నిమ్మసాగు విస్తీర్ణం పెరిగింది



నిమ్మ సాగు విస్తీర్ణం బాగా పెరిగింది. ఈ ప్రాంతంలో నిమ్మకు ప్రత్యామ్నాయం లేకుండా పోయింది. రాయితీతో రైతులకు మేలు చేకూరింది. సీజన్లో నిమ్మ దిగుబడులు ఉండడంతో రైతులు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. ఫలితంగా ఉద్యానశాఖ ద్వారా నిమ్మసాగు చేసే రైతుల సంఖ్య పెరిగింది.

– జీ రామయ్య, రైతు, చెర్లోపల్లి

రాయితీలతోనే మిర్చి సాగు



ఉద్యాన పంటల రాయితీలు లభించడం వల్లనే మిర్చి సాగు చేస్తున్నాను. మార్కెట్ సౌకర్యం కూడా బాగా ఉండడంతోనే ఆర్థికంగా నిలదొక్కుకున్నాం. ఉద్యానాధికారి క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి సలహాలు, సూచనలు కూడా చేశారు. మిర్చి దిగుబడి అవుతున్నా అకాల వర్షం వల్ల కొంత పంట దెబ్బతింది.

– జీ జయరామిరెడ్డి, రైతు, పొదలకూరు

పంటల సాగుకు ప్రోత్సాహం

ఉద్యాన పంటలను ప్రోత్సహించేందుకు ఉద్యానశాఖ ద్వారా రాయితీలను అందిస్తున్నాం. ప్రధానంగా పండ్ల తోటల సాగు విస్తీర్ణం పెంపొందించేందుకు కృషి చేస్తున్నాం. రైతుల అనుమానాలను క్షేత్ర స్థాయికు వెళ్లి నివృత్తి చేస్తున్నాం. పండ్ల తోటలతో పాటు కూరగాయలు, పూల తోటలు సాగు చేసే రైతులు తమను సంప్రదిస్తే రాయితీలను తెలియజేస్తామన్నారు.

– ఈ ఆనంద్, ఉద్యానాధికారి, పొదలకూరు

బిట్రగుంట ప్రగతికి నిర్మాణాత్మక పోరాటం

బిట్రగుంట: బిట్రగుంట రైల్వే అభివృద్ధికి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులపై ఒత్తిడి పెంచేలా నిర్మాణాత్మక పోరాటం చేపట్టనున్నట్లు బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు షేక్ నూరుద్దీన్ తెలిపారు. ఆదివారం బోగోలులోని అండేడ్కర్ విగ్రహం వద్ద బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూరుద్దీన్ మాట్లాడుతూ బిట్రగుంటను రైల్వేపరంగా అభివృద్ధి చేసేందుకు, ప్రైవేటీకరణ జరగకుండా ప్రయాణికుల వసతులకు భంగం వాటిల్లకుండా చర్యలు చేపట్టేందుకు పోరాటం చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఎన్నికల సమయంలో బిట్రగుంటను అభివృద్ధి చేస్తామని ఎన్నికల అజెండాతో వచ్చే నేతలు ఎన్నికల తర్వాత ముఖం చాటేయడం రివాజుగా మారిందన్నారు. 120 సంవత్సరాలకుపైబడిన చరిత్ర కలిగిన బిట్రగుంటలో రైల్వే పరమైన వైభవాన్ని నిర్వీర్యం చేసే ఇప్పటికీ కుట్రలు జరుగుతున్నాయన్నారు. వీటిని తిప్పికొట్టేందుకు భవిష్యత్‌లో కేంద్ర ప్రభుత్వాన్ని కదిలించే రీతిలో ఉద్యమాన్ని ఉధృతం చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఇందు కోసం జిల్లాకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలపై ఒత్తిడి తెచ్చి బిట్రగుంటలో రైల్వే పరమైన అభివృద్ధికి కృషి చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ ఆనందసాగర్, అంబేడ్కర్ సేవాదళ్ వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తుల రవిచంద్ర, విశ్రాంత రైల్వే కార్మికులు, బిట్రగుంట అభివృద్ధి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



బోగోలులో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తున్న బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యులు

పోస్టింగ్‌లకు ప్రసన్నం

కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో కీలక పోస్టింగ్‌ల కోసం మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రదక్షిణలు చేస్తున్నారు. అయితే సంబంధిత ప్రజాప్రతినిధులు కూడా ఇంకా బదిలీలపై దృష్టి సారించకుండా గతంలో అప్పటి ప్రభుత్వానికి, తమ పార్టీకి అనుకూలంగా పనిచేసిందెవరు? వ్యతిరేకులు ఎవరనే జాబితాలు సిద్ధం చేసే పనిలో ఉన్నారు. ఇంకా ఎవరికి అభయం ఇవ్వడం లేదు. ప్రజాప్రతినిధుల అభయం లభించని అధికారులు మాత్రం టెన్షన్‌లో ఉన్నారు.



- కీలక పోస్టులకు భారీ డిమాండ్
- ఎంపీలు, ఎమ్మెల్యేల చుట్టు ప్రదక్షిణలు
- నెల్లూరు చుట్టు పక్కల మండలాలపై దృష్టంతా
- నిబంధనలు పాటించే అధికారులకు దూరపు మండలాలు
- సిఫార్సు లేఖలకు సిద్ధం కాని లెటర్ హెడ్స్

నెల్లూరు (పొగతోట): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు చెందిన ప్రధానంగా ఎన్నికల నిర్వహణలో కీలకంగా వ్యవహరించే పోలీస్, రెవెన్యూ, మండల ప్రజా పరిషత్ అధికారులను వేరే జిల్లాలకు బదిలీలు చేశారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన సందర్భంగా బదిలీల ప్రక్రియకు త్వరలోనే పచ్చజెండా ఊపే అవకాశం ఉంది. దీంతో పక్క జిల్లాలకు బదిలీ అయిన ఉద్యోగులు తమకు అనుకూలంగా ఉండే కీలక పోస్టులు దక్కించుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు ఎంపీలు, ఎమ్మెల్యేల ఇళ్లు, కార్యాలయాలకు క్యూ కడుతున్నారు. కీలక నేతలను ప్రసన్నం చేసుకుని హామీ తీసుకున్న అధికారులు హుషారుగా ఉంటే.. అభయం లభించని అధికారుల మాత్రం టెన్షన్ పడుతున్నారు.

జిల్లాకు వచ్చేందుకు ఆరాటం..

రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో పనిచేసే జిల్లాకు చెందిన అధికారులు సొంత ప్రదేశానికి వచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. రాష్ట్రంలో నెల్లూరు జిల్లా ప్రశాంతమైందని, సేఫెస్ట్ జోన్ అని పేరుంది. దీంతో జిల్లాకు బదిలీలపై రావడానికి ఇష్టపడుతున్నారు. జెడ్పీ సీఈఓ, డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు, డీఎంహెచ్‌ఓ, సీపీఓ, డీఈఓ, మైనింగ్ డీడీ, ఏడీ, డీపీఓ, ఇరిగేషన్ ఎస్‌ఈ, పీఆర్ ఎస్‌ఈ, డీఎస్‌ఓ, డీఎం, సంక్షేమ శాఖలు, ఆర్‌డీఓలు, డివిజన్ స్థాయి పోస్టులు దక్కించుకునేందుకు తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. ఇతర శాఖల్లో ఉన్న అధికారులు ఫారిన్ సర్వీస్ ద్వారా కీలక పోస్టులు దక్కించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మర చేశారు. 2024 సాధారణ ఎన్నికల నేపథ్యంలో ప్రకాశం, బాపట్ల, తిరుపతి, చిత్తూరు జిల్లాలకు బదిలీలపై వెళ్లిన తహసీల్దార్లు, ఎంపీడీఓలు వచ్చే వారం తిరిగి జిల్లాకు వచ్చేయనున్నారు. ప్రకాశం, చిత్తూరు, బాపట్ల, తిరుపతి జిల్లాల నుంచి జిల్లాకు బదిలీలపై వచ్చిన తహసీల్దార్లు, ఎంపీడీఓలు ఆయా జిల్లాలకు బదిలీలు కానున్నారు. తిరిగి జిల్లాలకు బదిలీలపై వచ్చే తహసీల్దార్లు, ఎంపీడీఓలు నెల్లూరు చుట్టు పక్కల మండలాలు దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకుని సిఫార్సు లేఖలు తీసుకునే ప్రయత్నంలో ఉన్నారు. అయితే నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేలు, ఎంపీలకు లెటర్ ప్యాడ్స్ ఇంకా సిద్ధం చేయకపోవడంతో హామీలు తీసుకుంటున్నారు. మీరు అడిగిన పనులు చేసి పెడతాం అవకాశం ఇవ్వాలంటూ అడుగుతున్నారు. జిల్లాలో 37 మండలాలు, డీఏఓలు, కలెక్టరేట్ మొత్తం 51 తహసీల్దార్ పోస్టులు ఉన్నాయి. పాత జిల్లా ప్రకారం 46 మంది ఎంపీడీఓలు ఉన్నారు. నెల్లూరు, కావలి ఆర్‌డీఓ పోస్టులు దక్కించుకునేందుకు అనేక మంది స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లు ప్రయత్నాలు చేస్తున్నారు. నెల్లూరు అర్బన్, రూరల్ తహసీల్దార్ పోస్టులకు డిమాండ్ ఉంది. ఈ రెండు మండలాల తహసీల్దార్ పోస్టులు దక్కించుకునేందుకు అధిక శాతం మంది ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే తహసీల్దార్లను నియమించకుండా డిప్యూటీ తహసీల్దార్లను బదిలీలు చేసి వారికి ఇన్‌చార్జి తహసీల్దార్లుగా నియమించే అవకాశం ఉందని సమాచారం. నీతినిజాయితీగా పనిచేసిన అధికారులకు దూరపు మండలాలు, ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకున్న అధికారులకు దగ్గర మండలాలు దక్కనున్నాయి. అయితే బదిలీల ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో సిఫార్సుల కోసం వచ్చే అధికారులు గతంలో ఏ పార్టీకి అనుకూలంగా పనిచేశారు? వీరు మన పార్టీకి అనుకూలంగా పనిచేస్తారా? లేదా? అనే కోణంలో వివరాలు తెప్పించుకునే పనిలో ఎంపీ, ఎమ్మెల్యేలు ఉన్నారు.

విద్యుత్‌శాఖలో బదిలీలకు పైరవీలు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ పరిధిలో సాధారణ బదిలీల సందడి మొదలైంది. నాలుగేళ్లుగా ఒకే ప్రాంతంలో, ఒకే డివిజన్‌లో పరిధిలో విధులు నిర్వహిస్తున్న విద్యుత్ శాఖకు చెందిన అధికారుల సాధారణ బదిలీల ప్రక్రియకు సంబంధించి ఉత్తర్వులు ఈ నెలాఖరులోపు వచ్చే అవకాశం ఉంది. అయితే కొందరు విద్యుత్‌శాఖ అధికారులు మాత్రం ఇప్పటి నుంచే అధికార పార్టీకు చెందిన నాయకుల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు. జిల్లా వదిలి వెళ్లకుండా జిల్లాలోనే ఏదో ఒక డివిజన్‌లో ఉండేలా కొందరు, ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ప్రాంతం, డివిజన్‌లోనే ఉండేలా మరికొందరు ఉండేలా తమవంతు ప్రయత్నాలు సాగిస్తున్నారు. విద్యుత్ శాఖలో జిల్లా స్థాయి అధికారులు అయిన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు తమకు అనుకూలమైన ప్రాంతానికి బదిలీ కోసం ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలతో తమకున్న పరిచయాలతో ఎస్పీడీసీఎల్ ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకు వచ్చి తమకు నచ్చిన ప్రదేశాల్లో బదిలీ అయ్యేలా తమవంతు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఎలాంటి ఒత్తిళ్లు లేని, ప్రశాంతంగా, లాభదాయకంగా ఉండే పోస్టుల్లో పోస్టింగ్ కోసం పైరవీలు చేసుకుంటున్నారు.

వలంటీర్లతో రాజకీయ కుట్రలు

గత ప్రభుత్వంలో జగనన్న సేవకులుగా పనిచేసిన వలంటీర్లను అడ్డం పెట్టుకుని టీడీపీ రాజకీయ కుట్రలకు, వేధింపులకు తెర తీసింది. ఎన్నికలకు ముందు వలంటీర్లపై టీడీపీ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి విధులకు దూరం చేసింది. దీంతో టీడీపీ కుట్రలను నిరసిస్తూ వలంటీర్లు కొందరు తమ పదవులకు స్వచ్ఛందంగా రాజీనామా చేసి తమ ఆరాధ్య నేత వైఎస్ జగన్ సైన్యంగా ఎన్నికల విధుల్లో కీలకంగా పాల్గొన్నారు. ఇదే టీడీపీకి రుచించలేదు. అధికారంలోకి వచ్చిన టీడీపీ ఇప్పుడు వారిని భయపెట్టి, ప్రలోభపెట్టి వైఎస్సార్‌సీపీ నేతలపై పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేయిస్తుండడంపై చర్చనీయాంశంగా మారింది.

- గత ప్రభుత్వంలో క్రియాశీలకంగా జగనన్న సేవకులుగా పనిచేసిన వైనం
- ఎన్నికల ముందు టీడీపీ కుట్రలను నిరసిస్తూ రాజీనామాలు
- వైఎస్సార్‌సీపీలో చేరి ఎన్నికల్లో ప్రత్యక్షంగా ప్రచారం
- తాజాగా వరుసపెట్టి ఆ పార్టీ నేతలపై ఫిర్యాదులు చేయిస్తున్న వైనం

నెల్లూరు సిటీ: అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రజా సేవ కంటే ప్రతీకారేచ్ఛకు ప్రాధాన్యం ఇస్తోంది. వెలకట్టలేని అభిమానంతో గత ప్రభుత్వంలో జగనన్న సైన్యంలా వలంటీర్లు పని చేశారు. పిచ్చుకలపై బ్రహ్మాస్త్రంలా వలంటీర్లుగా పనిచేసి వారిని లక్ష్యంగా చేసుకుని రాజకీయ క్రీడకు తెరతీశారు. వలంటీర్లు అందరూ సామాన్యులే. ఇటువంటి వారిని భయపెట్టి వలంటీర్ల వ్యవస్థనే నిర్వీర్యం చేసే కుట్రలకు పాల్పడుతున్నట్లు అర్థమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులైన ప్రతి ఒక్కరికీ అందేలా, ఇంటింటికి వెళ్లి అందించడంలో వలంటీర్లు కీలక పాత్ర పోషించారు. నెల్లూరునగరంలోని రూరల్ నియోజకవర్గ పరిధిలో 26 డివిజన్లలో మొత్తం 1,148 మంది వలంటీర్‌లు విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఎన్నికల ముందు టీడీపీ నాయకులు ఈసీని అడ్డు పెట్టుకుని పింఛన్ల పంపిణీని వలంటీర్ల ద్వారా చేయనీయకుండా అడ్డుకున్నారు. ప్రజలకు సేవ చేయలేని విధుల్లో తాము కొనసాగలేమని దాదాపు 442 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామాలు చేశారు. తమకు ఇంతటి గౌరవాన్ని కల్పించిన జగనన్నకు మద్దతుగా వలంటీర్లందరూ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. అయితే అప్పట్లో కొందరు వలంటీర్లకు తాయిళాలు ఎరవేసి టీడీపీలో చేర్చుకున్నారు. ఆ రోజు పార్టీలో చేరిని వారిని లక్ష్యంగా చేసుకుని వారి వేళ్లతో వారి కళ్లు పొడుకునే విధంగా టీడీపీ నాయకులు కుట్ర రాజకీయాలు చేస్తున్నారు.

అధికారం రావడంతో...

టీడీపీ అధికారంలోకి రావడంతో ఎన్నికల ముందు స్వచ్ఛందంగా రాజీనామాలు చేసి వైఎస్సార్‌సీపీలో చేరిన వలంటీర్లను అడ్డం పెట్టుకుని అప్పట్లో వైఎస్సార్‌సీపీ నేతలు తమను బెదిరించి రాజీనామా చేయించారంటూ తాజాగా పోలీసులకు ఫిర్యాదు చేయిస్తున్న వైనం చూస్తుంటే టీడీపీ నీచ రాజకీయాలు, కుట్రలు ఏ స్థాయికి వెళ్లాయో అర్థమవుతోంది. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం 41 డివిజన్, ఆదివారం 21వ డివిజన్ వైఎస్సార్‌సీపీ నాయకులపై ఫిర్యాదులు చేయించారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా



ఏప్రిల్ 3వ తేదీన కొలువుకు రాజీనామా చేసి స్వచ్ఛంధంగా పార్టీలో చేరిన వలంటీర్లు

మాజీ వలంటీర్ల ఫిర్యాదు

నెల్లూరు(క్రైమ్): గతంలో వైఎస్సార్‌సీపీ నేతలు తమతో బలవంతంగా రాజీనామాలు చేయించారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు మాజీ వలంటీర్లు ఆదివారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గడిచిన రెండు రోజులుగా పలు పోలీసుస్టేషన్లలో వైఎస్సార్‌సీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న కార్పొరేటర్లు, నేతలపై వలంటీర్లు వరుస పెట్టి ఫిర్యాదులు చేయడం వెనుక ఒత్తిళ్లే కారణమని తెలుస్తోంది. అధికార పార్టీ నేతలు ఓ పథకం ప్రకారమే వైస్సార్‌సీపీ శ్రేణులను లక్ష్యంగా చేసుకుని కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

ఉత్కంఠభరితంగా క్రికెట్ టోర్నీ



హోరాహోరీగా సాగుతున్న మ్యాచ్

మనుబోలు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్రికెట్ టోర్నీ చివరి దశకు చేరుకుంది. క్వార్టర్ ఫైనల్స్‌ను ఆదివారం నిర్వహించారు. భీమ్ సైన్యంపై కేఆర్‌పురం యూత్.. కొండూరు బాలాజీ జట్టుపై వెంకన్నపాళెం.. అంబేడ్కర్‌నగర్ టీమ్‌పై ఎంజీసీటీ.. కేపీఎల్ రైజర్స్‌పై మనుబోలు మెయిన్ టీమ్ విజయం సాధించాయి. సెమీఫైనల్స్, ఫైనల్స్‌ను సోమవారం నిర్వహించనున్నారు. మొత్తం 30 జట్లు తలపడిన ఈ టోర్నీలో విజేతకు రూ.15 వేలు, రన్నర్స్‌కు రూ.పది వేలను బహుమతిగా అందజేయనున్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య



నెల్లూరు(క్రైమ్): రైలు కిందపడి గుర్తుతెలియని వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు సమీపంలో చెన్నై వైపు వెళ్లే రైలు పట్టాలపై ఆదివారం చోటుచేసుకుంది. మృతురాలు సుమారు 60 ఉంచి 65 ఏళ్లలోపు వయస్సు కలిగి.. మెరూన్ కలర్‌పై బ్లూ, పసుపు, తెలుపు డిజైన్ రంగు పూలు కలిగిన చీర, స్కై బ్లూ కలర్ జాకెట్‌ను ధరించి ఉన్నారు. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై హరిచందన ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు నెల్లూరు రైల్వే పోలీసులను సంప్రదించాలని ఆమె కోరారు.

మర్యాదపూర్వకంగా..



మంత్రికి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న ఎస్పీ, పక్కన కలెక్టర్

నెల్లూరు(దర్గామిట్ట) / నెల్లూరు(క్రైమ్): రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం తొలిసారిగా నగరానికి విచ్చేసిన ఆనం రామనారాయణరెడ్డికి పలువురు ప్రముఖులు పుష్పగుచ్ఛాలను అందజేసి అభినందనలు తెలిపారు. మంత్రిని సంతపేటలోని ఆయన నివాసంలో కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలను తెలియజేశారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



పురస్కారాలను అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): పదో తరగతి, ఇంటర్‌లో టాపర్లుగా నిలిచిన గాండ్ల, తెలికుల విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, నగదు ప్రోత్సాహకాలను గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. నగరంలోని దేవిశెట్టి స్వాములు కల్యాణ మండపంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గ్రోసు సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొర్రా మధుసూదన్ మాట్లాడారు. బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగా గాండ్ల, తెలికుల కులస్తులను సీఎం చంద్రబాబు ఆదుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులకు నగదు పురస్కారాలను గ్రోసు గోపాలయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అందజేశారు. నేతలు అనంతం నాగరాజు, ప్రభాకర్‌రావు, హరగోపాల్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ :	రూ.157
లేయర్ :	రూ.120
బ్రాయిలర్ చికెన్ :	రూ.276
స్కిన్‌లెస్ చికెన్ :	రూ.306
లేయర్ చికెన్ :	రూ.204



పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.65
సన్నవి	: రూ.40
పండ్లు	: రూ.30





ప్రార్థనలు చేసేందుకు వీలుగా ఏర్పాటు చేసిన కార్పెట్, భారీ షామియానా



తాగునీటి వసతి

బక్రీద్‌కు విస్తృత ఏర్పాట్లు

బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లింలు ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా నగరంలోని బారాషహీద్ దర్గా సమీపంలో గల ఈద్గా వద్ద విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. భారీ షామియానాలు, కార్పెట్, తాగునీటి వసతిని నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో కల్పిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



వీఐపీల కోసం ప్రత్యేకంగా..

యువకుడి అనుమానాస్పద మృతి



కందుకూరు: యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన పట్టణంలోని ఉప్పుచెరువు కాలనీలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల వివరాల మేరకు.. పట్టణంలోని ఉప్పుచెరువు కాలనీ పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో కిశోర్ (35) కేటరింగ్ పనులు చేసుకుంటూ భార్యతో కలిసి జీవనం సాగిస్తున్నారు. ఈ తరుణంలో శవమై సమీపంలోని ఉప్పుచెరువులో తేలారు. ఉదయాన్నే అటువైపు వెళ్లిన కొందరు చెరువు వద్ద మృతదేహాన్ని గుర్తించి స్థానికులకు సమాచారమిచ్చారు. అక్కడికి చేరుకున్న స్థానికులు చెరువులో పడి మృతి చెందిన యువకుడ్ని కిశోర్‌గా గుర్తించి పోలీసులకు సమాచారాన్ని అందించారు. ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోలీసులు వెలికితీసి పోస్ట్‌మార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. కాగా కిశోర్ అనుమానాస్పద మృతిపై స్నేహితులు పలు అనుమానాలు వ్యక్తం చేశారు. కాలనీలో అందరితో సరదాగా ఉంటారని, ఎలాంటి విభేదాల్లేవని చెప్పారు. రాత్రి పూట మద్యం తాగేందుకు అప్పుడప్పుడూ ఉప్పుచెరువు వైపు వెళ్తుంటారని తెలిపారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమై.. ఆపై శవమై..

నెల్లూరు(క్రైమ్): మూడు రోజుల క్రితం అదృశ్యమైన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం ఆకుతోటకు చెందిన శ్రీనివాసులు (39) నగరంలోని ఓ ప్రింటింగ్ ప్రెస్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఈ క్రమంలో ఈ నెల 12వ తేదీ సాయంత్రం తన స్నేహితుడు గోపీతో కలిసి నగరానికి వచ్చారు. హరనాథపురంలోని ఓ మద్యం దుకాణం వద్ద మద్యం సేవించారు. తన భార్య ఊరెళ్తోందని, బస్సెక్కించి వస్తానంటూ శ్రీనివాసులు అక్కడి నుంచి రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో వెళ్లారు. అప్పటి నుంచి అతని జాడ తెలియరాలేదు. బాధిత కుటుంబసభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో శ్రీనివాసులు సోదరుడు బాలాజీ నగర్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. అదే రోజు రాత్రి హరనాథపురం ఎక్స్‌టెన్షన్ ఏరియాలో వాకింగ్ చేసేందుకు వచ్చిన స్థానికులు.. మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోలీసులు పరిశీలించారు. మృతదేహం దుర్గంధం వెదజల్లుతూ ఉంది. ఓంకార్ అతని కుటుంబసభ్యులను పిలిచి మృతదేహాన్ని చూపించగా, వారు శ్రీనివాసులేనని గుర్తించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. అదృశ్యం కేసును అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ వీరానాయక్ దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ జెండా స్తూపం ధ్వంసం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా స్తూపాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటన నగరంలోని 54వ డివిజన్ ఇస్లాంపేట సెంటర్‌లో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఇలాంటి ఘటనలకు పాల్పడటం తగదని పార్టీ నేతలు పేర్కొన్నారు.

పది కిలోల కణితి తొలగింపు



నెల్లూరు(అర్బన్): ఓ మహిళ కడుపులో నుంచి పది కిలోల కణితిని శస్త్రచికిత్స ద్వారా తొలగించారు. దీనికి సంబంధించిన వివరాలను నగరంలోని దీప్తి నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ లోకనాథం వివరించారు. అల్లూరు మండలానికి చెందిన 45 ఏళ్ల కవిత రెండేళ్లుగా కడుపునొప్పితో బాధపడేవారని చెప్పారు. పొట్ట కింద భాగం పెద్దగా పెరిగిందని, మూత్రం సక్రమంగా వచ్చే ది కాదని తెలిపారు. పలు చోట్ల వైద్యం చేయించుకున్నా ప్రయోజనం లేకపోవడంతో తమ ఆస్పత్రికి వచ్చారని చెప్పారు. పరీక్షల అనంతరం పొట్టలో పది కిలోల కణితి ఉందనే అంశాన్ని గుర్తించామని వివరించారు. వెంటనే ఆమెకు వివరించి ఆపరేషన్ ద్వారా తొలగించామని తెలిపా రు. ఆమె కోలుకుంటున్నారని వెల్లడించారు. గైనకాలజిస్ట్ సుమతి పాల్గొన్నారు.

ఆర్చరీ క్రీడాకారుల ఎంపిక



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో పాల్గొననున్న జిల్లా క్రీడాకారులను ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఎంపిక చేశారు. బాలికల విభాగంలో లాస్య, శ్రీవల్లి, హాస్యవర్షిణి, ప్రీతి, మనన్య, సుప్రీత.. బాలుర విభాగంలో కౌశిక్ అహ్మద్, హరిశ్రీకర్, మహిధర్, శశాంక్, చక్రేష్‌కుమార్, చరణ్ ఎంపికయ్యారు. బాలికల రికర్వ్ రౌండ్ విభాగంలో హారిక, డెలీషా, బాలుర రికర్వ్ విభాగంలో అక్షయ్ మహదేవ్, నూతన్, చరిత్, సూర్యతేజ, విఘ్నేష్, శ్రీకర్‌ను ఎంపిక చేశారు. బాలుర కాంపౌండ్ విభాగంలో అశ్విన్ మహదేవ్, జ్ఞానశిరీష్, వరుణ్‌రెడ్డి, వికాస్ ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు విజయవాడలో ఈ నెల 22 నుంచి 24 వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లంరెడ్డి శ్రీహర్ష, పావురాల వేణు తెలిపారు.

ఇంజినీరింగ్ విద్యపై అవగాహన



కోట: ఇంజినీరింగ్ విద్య ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన సదస్సును విద్యానగర్‌లోని ఎన్బీకేఆర్ ఐఎస్టీలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి మాట్లాడారు. ఇంజినీరింగ్ కోర్సులు, కళాశాలల ఎంపిక.. కౌన్సెలింగ్ సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరే విద్యార్థులు పరిశోధనలపై ఆసక్తి చూపాలని సూచించారు. ఎన్బీకేఆర్ ఐఎస్టీలో ఉన్న మౌలిక సదుపాయాలను వివరించారు. హెచ్ఓడీలు చింతా రవీంద్రరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, హరనాథ్‌రెడ్డి, కిషంధర్ పాల్గొన్నారు.

బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

నెల్లూరు(దర్గామిట్ట): బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలపై అల్లా ఆశీస్సులు మెండుగా ఉండాలని కాంక్షించారు.

- త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కలెక్టర్ హరినారాయణన్ కాంక్షించారు.

నెల్లూరు(క్రైమ్): బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ కాంక్షించారు. మసీదులు, ఈద్గాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశామని చెప్పారు.

స్వగ్రామానికి వచ్చి తిరిగెళ్తూ..

- రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దుర్మరణం
- కంటైనర్‌ను ఢీకొన్న కారు



ప్రమాదానికి గురైన కారును పరిశీలిస్తున్న ఎస్సై

కోవూరు: శుభకార్యం నిమిత్తం సొంతూరొచ్చి.. తిరిగి ఉద్యోగ విధులకు వెళ్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను రోడ్డు ప్రమాదం కబళించిన ఘటన కోవూరు పరిధిలోని జాతీయ రహదారిపై ఏసీసీ కల్యాణ మండప సమీపంలో ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. వివరాలు.. బాపట్ల జిల్లా బల్లికురవ మండలం అంబలపూడికి చెందిన కూరపాటి మురళీమోహన్ (41) చెన్నైలోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఓ శుభకార్యం నిమిత్తం ఊరొచ్చిన ఆయన తిరిగి తన భార్య, కుమారుడు, కుమార్తెతో కలిసి కారులో బయల్దేరారు. ఈ క్రమంలో కోవూరు సమీపంలోని జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న కంటైనర్ లారీని ఢీకొన్నారు. ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందగా, మిగిలిన వారు స్వల్పంగా గాయపడ్డారు. వీరిని కోవూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కారులో ఇరుక్కుపోయిన మురళీమోహన్ మృతదేహాన్ని బయటకు తీశారు. ఘటన స్థలాన్ని ఎస్సై రంగనాథ్‌గౌడ్ పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కండలేరులో 6.43 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 6.438 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15, పిన్నేరువాగుకు 20, లోలెవల్ కాలువకు 40 క్యూసెక్కులను విడుదల చేస్తున్నామని వివరించారు.

విలువలను కాపాడాల్సింది రాజ్యాంగ శక్తులే



మాట్లాడుతున్న రజని



హాజరైన ప్రజలు

నెల్లూరు (అర్బన్): పౌరుల స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలకు సంబంధించి రాజ్యాంగ పీఠికలో పొందుపర్చిన విలువలను కాపాడాల్సింది రాజ్యాంగ శక్తులేనని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి రజని పేర్కొన్నారు. డాక్టర్ జెట్టి శేషారెడ్డి 16వ వర్ధంతిని పురస్కరించుకొని రాజ్యాంగం.. విలువలు.. సవాళ్లు, ఆరోగ్యహక్కు చట్టం అనే అంశాలపై స్మారక సదస్సును హరనాథపురంలోని జేఎస్ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. జెట్టి శేషారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఆమె మాట్లాడారు. డెత్ పెనాల్టీ, స్త్రీలపై వేధింపులు తదితరాల్లో అనేక అంశాలున్నాయని, ఈ క్రమంలో శిక్షల విషయంలో జడ్జిలకు స్వేచ్ఛనివ్వాలని చెప్పారు. బాగా చదువుకొని.. మంచి నేతలను ఎన్నుకోవాలని కోరారు. అనంతరం ప్రపంచ ప్రజారోగ్య ఉద్యమ సమన్వయకర్త డాక్టర్ సుందరరామన్ మాట్లాడారు. ఆరోగ్యం అనే అంశం రాష్ట్ర పరిధిలోనే ఉండాలని చెప్పారు. ఇప్పటికీ పేదలు, మధ్య తరగతి వారికి ఆరోగ్యం అందని ద్రాక్షగా మారిందని తెలిపారు. వైద్యం అత్యంత ఖరీదైందిగా మారిందన్నారు. రామచంద్రారెడ్డి ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రమణయ్య, జేఎస్ ట్రస్ట్ చైర్మన్ చంద్ర రాజగోపాల్, జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు గేయానంద్, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, డాక్టర్ రవీంద్ర, అడ్వొకేట్ అంకయ్య, వివిధ ప్రజాసంఘాల నేతలు మధు, ఉదయభాస్కర్ పాల్గొన్నారు.